


తెల్లారకట్ట పాలవాడి కేకతో మూర్తికి నిద్ర మెళకువ వచ్చింది. పద్మావతి తలుపు తెరచి పాల వాడు గేదెని పిండటం గమనిస్తున్నది గుమ్మంలో నిలబడి. మంచంమీద పడుకొనేవున్న మూర్తికి గుమ్మంలో పాలవాడు పాలు పిండటం, ఎదురింటి వాళ్ళింటి ముందప్పుడే కళ్ళాపి చల్లుతూండటం కనిపిస్తున్నాయి.

“పద్మా! ఎదురింటివాళ్ళివ్వాళ అప్పుడే లేచారేం” అన్నాడు మూర్తి. ఎదురింటివారేనాడూ ఏడు గొంది తలుపులు తెరవక పోవటం వల్ల ఆశ్చర్య పడుతూ.

“ఇవ్వాళ వైకుంఠేకాదశి కాదుటండీ అందు కని సత్యనారాయణ స్వామి వ్రతం కూడా చేసుకుంటారట. చుట్టాలు పక్కాలూ రారూ అందుకే తెల్లారకట్ట లేచారివ్వాళ.” అంటూ పాలగిన్నె తీసుకొని వంటింట్లో కెళ్ళింది పద్మ.

“అవును ఇవ్వాళ వైకుంఠేకాదశి. నేనూ ఏకాదశి ఉపవాసం [illegible]న్న సత్యనారాయణస్వామి వ్రతం చేసుకుంటే?” [illegible]చన వచ్చిన మరుక్షణం పక్కమీద లేచి కూర్చున్నాడు.

“అదేమిటి అప్పుడే లేచేశారు? కాఫీ తయారు కావటానికి ఇంకా ఆలస్యం ఉంది. పడుకోండి” అన్నది పద్మ.

“పద్మా మనం ఏకాదశి ఉపవాసం ఉండి, వ్రతం చేద్దాం—ఏమంటావు?” అన్నాడు మూర్తి.

“నిజంగా?” సంతోషంతో మూర్తి వంక చూసింది మంచ మెత్తుతున్న పద్మ.

“అవును” అంటూ మూర్తి కాలకృత్యాలు తీర్చు కొని ముఖం కడిగేసి దేవుడి పటం ముందు నిల బడి “ఇవ్వాళ వ్రతం చేసుకుంటాము” అని దణ్ణం పెట్టుకున్నాడు.

“ఇవాళ ఏమీ తినరాదు. తాగరాదు. సాయంకాలం పూజయ్యాక ప్రసాదం కొద్దిగాస్వీకరించాలి” అన్నాడు మూర్తి.

“నాకు తెలీదుటండీ చెప్పాలా?...... అయితే నాకు చాలా తీరుబడి! కాఫీ వంటా హడావిడి ఏమీ లేదు. మీరూ, అన్నట్లు ఆఫీసుకు వెళ్ళ రుగా. ఉపవాసం ఉండి ఏమెళ్తారూ?” అంటూ వంటింట్లోకి ఏదో పనిమీద వెళ్ళింది పద్మ.

మూర్తి ఆలోచనలో పడ్డాడు.

ఆఫీసు! హెడ్‌క్లర్కు! ఆఫీసుకు వెళ్ళక పోవటమే! శలవు పెడితే తనని బ్రతక నిస్తాడూ! మరి పద్మ అన్నట్లు ఉపవాసం ఉండి ఆఫీసుకువెళ్తే ఏం పని చేయగలడు? తనకా సీట్లో కూర్చుంటే తలొంచుకు ఫైల్సు రాస్తూ పోవటమే అలవాటు కానీ చేసి నట్లు నటిస్తూ గంటల తరబడి ఒకే ఫైలుతో కాలక్షేపం చేయటం చేతకాదు. తిండిలేక నీర సించి పని చేయలేని పరిస్థితిలో ఆఫీసుకొచ్చి పని చేసినట్టు నటించటం చాల పెద్ద నేరం. అంత కంటె శలవు తీసుకొని ఇంటిదగ్గర వుండిపోవటం తప్పుకాదు. కాని శలవు ఏమని పెట్టాలి. వ్రతం చేసుకోవాలని శలవుపెడితే లాభం లేదు. కాజ్యుల్ లీవు ఒక్క అనారోగ్య కారణంగానే ఇంటి వద్ద వుండి వాడుకోవచ్చుగాని మిగతావాటికి ముందే తీసుకోవాలని ఉత్తరువు.

కాగితం తీసుకున్న మూర్తి “వంట్లో బాగో లేని కారణంగా ఆఫీసుకు రాలేక పోతున్నాను. అని వ్రాయ బోయి హఠాత్తుగా ఆగాడు. సత్యనారా యణస్వామి వ్రతం చేసుకోవాలని అసత్యం ఆడి శెలవ పెట్టటమా. ఛా! అలా ఎన్నటికి చెయ్యరాదు.

అలా చేస్తే అది అసత్యనారాయణ వ్రతం అవుతుంది. ఒక్క శెలవ విషయమేకాదు. తాను కనీసం ఆ ఒక్క రోజైనా ఎలాంటి ఎంత చిన్న అబద్ధమైనా సరే ఆడరాదని గట్టిగా నిర్ణయానికి వచ్చాడు. ఆఫీసుకు వెళ్లి పని చేయాల్సిందే. అంత చేయలేక పోతే అప్పుడే అడిగి సగం రోజు శెలవు పెడితే సరిపోతుందని అనుకున్నాడు.

"ఇల్లంతా శుభ్రంగా కడిగించి ముగ్గేసి ఉంచు. సాయంత్రం వస్తూ వస్తూ బజారుకు పోయి కావలసిన పూజ సామాను పట్టుకొస్తాను. పురోహితుడిక్కూడా చెప్పొస్తాను." అంటూ ఆఫీసుకు కదలబోతున్న మూర్తి దగ్గరకొచ్చిన పద్మ..

"ఏమండీ నాకో పదిరూపాయలు కావాలి. ప్రక్కింటావిడ అదేవో లాటరీ టిక్కట్లు ఇచ్చింది. డబ్బివ్వాలిస్తానన్నాను", అని అడిగింది.

పద్మకి ఇలాంటి లాటరీ టిక్కట్ల పిచ్చి చాలా ఉంది. దగ్గర పైకం ఉన్నదని తెలిస్తే ఇచ్చిందాకా వెళ్లనివ్వని స్వభావం పద్మది. అందుకే ఈ మధ్య మూర్తి తరచుగా డబ్బులున్నా, నాదగ్గర లేవు. ఆ టిక్కెట్లు తిరిగిచ్చేయ్యమని చెప్పి వెళ్లుతుండేవాడు. డబ్బులేవు నాదగ్గర అని అందామని నాలుకదాకా వచ్చిన మాటను ఆపుకున్నాడు మూర్తి, వ్రతం సంగతి జ్ఞాపకం వచ్చి.

"పద్మా! ఇవ్వాళ వ్రతం చేసుకుందామనుకున్నాం. నాదగ్గర ఉన్నవే పది రూపాయలు. అవి టిక్కెట్లకిస్తే ఎలాగు చెప్పు" అన్నాడు.

"ఆమెకి మాటిచ్చాను. ఆమె వూరుకోదు. అదృష్టం తిరిగితే మంచి బహుమతే వస్తుంది. ఏమైనా సరే ఇవ్వాలి ఆమెకి" అన్నది పద్మ.

"మరి వ్రతమో" అన్నాడు మూర్తి.

"మరీ తమాషాగాని పదిరూపాయలు పుట్టించలేరా ఏంటి?" అంటూ మూతి ముడుచుకున్నది పద్మ.

ఆనాడు సంతోషంగా వ్రతం చేసుకోవాలనుకున్న మూర్తి, పద్మ ఇక రోజంతా ముడుచుకొని ఉండే అలవాటు కాబట్టి, ఉన్న పది రూపాయలు ఆమెకిచ్చి ఆఫీసు కెళ్లాడు.

"ఆ ఫైలు మీ సీటుకొచ్చి పదిరోజులైందిట. రాలేదని డబాయించకండి."

"ఎవడన్నాడయ్యా—ఏదీ నాటేబిల్ మీద?"

"క్రింద గుమాస్తా మూర్తి చెప్పాడు."

వచ్చిన ఆసామీ ఈ మాటనేసరికి హెడ్ గుమాస్తా మూర్తి వంక ఉరిమి చూసి "ఎప్పుడయ్యా నాకు పంపింది. పైగా అబద్ధాలు చెబుతావా? వెంటనే 'ఆ కాగితాలు తెచ్చి నాముందుంచకపోయావో నీపని చెబుతా" అన్నాడు.

మూర్తికి పై ప్రాణాలు పైనే పోయాయి.

"ఉండండి మీతో ఘర్షణెందుకు. ఇక్కడంటె అక్కడ, అక్కడంటె ఇక్కడా అని ఆడిస్తున్నారు" అంటూ ఆ వచ్చిన పెద్దమనిషి ఆఫీసర్ గదిలోకి దూసుకు పోయాడు.

వెంటనే ప్యూన్ వచ్చి ఆఫీసరుగారు పిలుస్తున్నాడని చెప్పాడు మూర్తికి.

మూర్తి వణుకుతూ ఆఫీసర్ గదిలోకి వెళ్లాడు.

"మూర్తీ! ఏమైందా ఫైలు. ఎందుకు పంపలేదు. ?" గద్దించాడు ఆఫీసర్. మూర్తి, తెలిసిన సంగతి దాచటం అబద్ధం చెప్పటం అనుకున్నాడు.

"హెడ్ గుమాస్తాగారి కిచ్చానండీ వారం రోజుల క్రితం" అన్నాడు వణుకుతూ మూర్తి.

"ఆయన లేదంటున్నాడు. నిజం చెప్పు, ఎక్కడ దాచావు."

"నేను కాదండీ దాచింది." మూర్తి గొంతు వణికింది.

"మరి దాచిందెవరు? హెడ్‌గుమాస్తానా? ఎక్కడ దాచాడు?" మూర్తికి చిరు చెమటలు పోశాయి. హెడ్ గుమాస్తా ఆ ఫైలు తన ముందటే తన సొరుగులో పెట్టి తాళం వేశాడు. పైగా అనాడు "మూర్తీ నాలుగు డబ్బులొచ్చే కేసు. ఆఫీసరు తెలుసుకదా అని ప్రతి దఫా ఈయన మన చాత వూరికే చాకిరీ చేయించు కుంటున్నాడు. ఈ తడవ నువు అలా ఉండు. కాగితాలు ఎక్కడో ఉన్నైన అని చెప్పు— నేనో ఆట ఆడిస్తాను" అన్నాడు హెడ్ గుమాస్తా.

మామూలుగా అయితే హెడ్ గుమాస్తా మాట పాటించేవాడే. ఇవాళ అబద్ధం చెప్పరాదని నిర్ణయించుకోవడం వల్ల ఆ ఫైలు హెడ్ గుమాస్తా కిచ్చానని చెప్పేశాడు మూర్తి. ఇప్పుడది ఎక్కడుందో కూడా తెలుసు. ఆసంగతి తానుచెబితే హెడ్‌గుమాస్తా తనగొంతు పిసికి పారేస్తాడు. మరి తెలీదని చెప్పటమా. ఎదురుగ్గా అప్పుడే హెడ్ గుమాస్తా కూడా వచ్చి నిలబడ్డాడు.

"మాట్లాడవేం?" మళ్ళీ గర్జించాడు ఆఫీసర్.

"అది అది హెడ్ గుమాస్తా గారి సొరుగులో ఉన్నది." అనేశాడు మూర్తి.

ఆఫీసరు స్వయంగా బైటికొచ్చి హెడ్‌గుమాస్తా చేత సొరుగు తాళం తీయించాడు. కాగితాలు బైట పడ్డై.

వినయంగా ఆఫీసరు వంక నవ్వాడు హెడ్ గుమాస్తా. మూర్తి వంక నిప్పులు చెరిగే చూపులతో చూస్తూ—

"లక్ష కాగితాలొస్తై నా టేబిల్ మీదికి. అతిముఖ్యం అని సొరుగులో దాచాను నీముందే. మర్నాడు జ్ఞాపకం చెయ్యమన్నా—అలా చెయ్యక పోగా, ఇందాక నాకే కాస్తంత జ్ఞాపకం చేసి ఏడవ రాదూ?" అని నోరు బారేసుకున్నాడు.

అప్పటికి పన్నెండైంది. హెడ్‌క్లర్కుకు, మూర్తిని ముక్కలు చేద్దామని పిస్తున్నది. అతని పని తణిఖీ ప్రారంభించాడు.. అది చెయ్యలేదు ఇది చెయ్యలేదంటూ! అరగంట అవస్త పెట్టాడు. సత్యనారాయణ వ్రతం చేసుకోవాలని ఉపవాసం ఉండి నీరసంగా పని చెయ్యలేక పోయానని మూర్తి ఇచ్చిన సమాధానంతో మరీ మండి పడ్డాడు.

"డ్యూటీతో సమానమైన దేముడు లేదు. తన విద్యుక్త ధర్మాన్ని మరచిన వాణ్ణి దేవుడు క్షమించడు............."

"వెధవ వేషాలు మాని పని చెయ్".

"స్టేట్ మెంట్ సంగతి ఏంచేశావ్?" చుర చుర చూశాడు హెడ్ గుమాస్తా

"ఇంకా కాలేదనీ, నిన్నే తమరికి".... భయంతో మూర్తి గొంతు వణికి పైకి రాలేదు.

అవేం సాగవు. వెధవ్వేషాలెయ్యకు నాదగ్గర. ఇప్పుడు పన్నెండున్నరైంది. రెండున్నర కల్లా టైప్ చేయించి నాటేబిల్ దగ్గరికి పట్టుకురా. కదల్టానికి వీల్లేదు. వింటున్నావా?

"మంచిదండీ అలాగే"..

హెడ్ క్లర్కు రామనాధం విసురుగా వెళ్లి తన కుర్చీలో కూర్చున్నాడు.

మూర్తి మనస్సు అల్లకల్లోలంగా ఉంది. ఏ పని చెయ్యాలో తోచటం లేదు. అన్నీ అర్జంటే. అన్నీ అర్ధ గంట గంటలో అయిపోవాలి. రామనాధం గారు ఇంతగా ఈరోజు రెచ్చి పోవడానికి కారణం తానా "కేసు" అతగాడి సొరుగులో ఉందని చెప్పటమే. అదే ఇన్ని అనర్థాలకు దారి తీసింది.

ప్రక్కసీట్లో ఉన్న గుమాస్తాలందరూ తనవంక సానుభూతిగా చూస్తున్నారు. శంకరం వచ్చి మూర్తికి కాస్త సాయం చేయ బోయాడు.

ఒంటిగంట లోపల స్టేట్‌మెంటు తయారు చేసి టైపిస్టు సరోజ సీటు దగ్గరకు పరుగెత్తాడు మూర్తి. సరిగ్గా అప్పుడే సీట్లోంచి లేచిపోబోతున్నది సరోజ.

"ఏమండీ దయచేసి ఇది అర్జంటుపని. కాస్త శ్రమనక రెండున్నరకల్లా కావాలి" ప్రాధేయ పడ్డాడు.

"స్టేట్‌మెంటు టైపు చెయ్యడం కాస్త ఆలస్యం పడుతుందండీ మూర్తిగారూ. ఇవ్వాళ మాయింట్లో సత్యనారాయణ వ్రతం చేసుకుంటున్నారు మా అమ్మా నాన్నా. నేను ఇంటికి వెళ్తున్నా భోజనానికి. కాస్త ఆలశ్యంగా కూడా రావచ్చు ఏలా చెప్పండి?

"నా ఉద్యోగంపోయేలా ఉందండీ సరోజగారూ. ఈ హెడ్‌క్లర్కు రామనాధం నా ప్రాణం తీస్తున్నాడు. ఇవాళ ఉపవాసం ఉండి ఆఫీసుకొచ్చాను దయచేసి ఏలాగైనా...?"

"మూర్తిగారూ— మీ మాటెప్పుడన్నా కాదు అన్నానా? వ్రతం పూర్తికాగానే భోజనం త్వరగా ముగించుకొస్తా. ఏలా చెప్పండి. వ్రతంకదూ?"

సందిగ్ధావస్థలో పడ్డాడు మూర్తి. ఏమీ అనలేకపోయాడు."

"సరే వీలైనంత త్వరగారండి. సరోజగారూ. పోనీ నేను భోజనానికి వెళ్లటం లేదు కాబట్టి నేనే టైపు చేసుకుంటాను. మీకు అభ్యంతరం లేకపోతే.

"సరే కానివ్వండి. అవిగో కార్బన్సు, కాగితాలూ. తాళం చెవి ఇదిగో." అని కదలబోయే సరోజను తలొంచుకొనే "సరోజగారూ" అంటూ సంబోధించాడు మూర్తి. ఏమి టన్నట్టు ఆగింది సరోజ.

"మీరేమీ అనుకోకుండా ఉంటే— సాయంత్రము సత్యనారాయణవ్రతం చేసుకుందామనుకున్నాము— వో పదిరూపాయలు అప్పుగా— మళ్లీ జీతంరోజు ఇచ్చేస్తా."

"అంతేకదా, ఆలాగేనండీ దీంట్లో అనుకోటం ఏవుందీ. వచ్చేటప్పుడు పట్టుకొస్తా, ఇప్పుడు దగ్గర్లేదు. చూడండి రామనాధం అడిగితే ఇప్పుడే బైటికి వెళ్ళిందని చెప్పండీ." అంటూ సరోజ వెళ్ళింది.

రెండున్నరదాకా మూర్తి టైపు చేస్తూనే ఉండిపోయాడు. ఇంకా టైపు చెయ్యవలసింది

ఉన్నది. మనిషి చాలా నీరసంగా ఉన్నాడు. రామనాథం పిలుస్తాడన్న భయం ఎక్కువైంది. ఆ తొందరలో తప్పులెక్కడ పడతయ్యో అని చాలా జాగ్రత్త పడుతున్నాడు. మూడు కావస్తున్నది. రామనాథం మూర్తిని వెతుక్కుంటూ వచ్చాడు.

"నువ్వెందుకు టైపు చేస్తున్నావు? సరోజ ఏమైందిఏ?"

"సరోజ ఇప్పుడే బైటికి వెళ్ళింది" అనబోయి మూర్తి అబద్ధం ఆడలేక ఆగిపోయాడు. "మాట్లాడవేం?" అని గద్దించాడు రామనాథం.

"సరోజ......... సరోజ— ఇంటికి......"

"ఎన్నింటి కెళ్ళింది?........."

"ఒంటి గంటకు" బాధగా చెప్పాడు మూర్తి.

రామనాథానికి పట్టరాని కోప మొచ్చింది.

"సిగ్గు లేకపోతే సరి. సరోజ పనంతా నువ్వు చేస్తూ ఆవిణ్ణి ఇంటికి పంపావన్నమాట! ఈ వేషా లెప్పట్నించి సాగించావు? ఇహ నువ్వు ఆఫీసులో ఉన్నట్టే?"

"రామనాథంగారూ....... ఆవిడ"

"ఆవిడకి నౌకరీ చేస్తున్నావా? ఆ స్టేటుమెంటు పూర్తిచేసి తీసుకురా. సరోజని రానీ చెస్తా, మూడు దాటుతున్నది ఇప్పుడు" అంటూ పెద్ద పెద్ద అంగలేసుకుంటూ వెళ్ళాడు రామనాథం.

ఓ పావుగంటలో టైపు పూర్తిచేసి స్టేటుమెంటు రామనాథంగారి టేబిల్ మీదికి చేర్చాడు మూర్తి. రామనాథం సీట్లోలేడు.

తన కుర్చీలో కూలబడి ఫైలు చూస్తున్న మూర్తి దగ్గర కొచ్చింది, సరోజ కోపంగా.

# సత్యనారాయణ వ్రతం

"ఏమండీ ఆయనచేత నన్ను నానామాటలూ అనిపించారట! "ఆ స్టేటుమెంట్" మిమ్మల్ని నేను టైపు చెయ్యమన్నానా? మీకై మీరు చేసుకుంటానం టే సరేనన్నాను. ఆ మాట ఆయన్తో చెప్పటానికి నోరు లేకపోయిందాండీ. అందర్లో ఆయన అలా అరుస్తూవుంటే— తాళం చెవి ఇలా ఇవ్వండి. అంటూ మూర్తి ఇచ్చిన తాళం చెవి తీసుకుని వెళ్ళబోతున్న సరోజని అప్పుడే ఆఫీసరు దగ్గరనుంచి వస్తున్న రామనాథం "సరోజా" అని పిలిచాడు.


సరోజని ఇంకా ఏమంటాడో తన మూలంగా ఇంకా ఏం మాటలు పడుతుందో అనేభయంతో, తానే ఆ కాగితాలు టైపు చేసుకుంటానని అన్న సంగతి చెప్పటానికి మూర్తి కూడా రామనాథం గారి టేబిల్ దగ్గరకు వెళ్ళాడు.

"నువ్వెందుకయ్యా — వెళ్ళి పని చూసుకో పో" అని రామనాథం గదమాయించాడు. తలొంచుకొని వచ్చి కుర్చీలో కూలబడ్డాడు మూర్తి.

"సరోజా నిలబడ్డావేం కూర్చో" అన్నాడు రామనాథం.

సరోజ కోపంగా "అక్కర్లేదులెండి ......" నిలబడే వుంది

"చెప్తేనే, నే కాదంటానా? పోనీలే ఏం విశేషం ఇవాళ?" అనునయింపుగా అడిగాడు రామనాథం.




మూర్తి తన చెవుల్ని తనే నమ్మలేకపోయాడు రామనాథంలో ఇంత మంచితనం ఉందా అని మూర్తి ఆశ్చర్యపోయి గుడ్లప్పగిస్తూ చూస్తున్నాడు.

"ఇవ్వాళ మాయింట్లో వ్రతం అండీ" నాజూగ్గా మెడతిప్పుతూ అన్నది సరోజ.

"చెప్పావు కాదూ? సెలవు పెట్టకపోయావా? వెధవపన్లు రోజూ ఉండేవేగా" అన్నాడు రామనాథం.

"ఆ ఎందుకనీ......" అర్థోక్తిలో ఆగిపోయింది.

రామనాథం ఎగతాళిగా మూర్తివంక ఓసారి చూసి "సరే వెళ్ళి పనిచూసుకో సరోజా." అన్నాడు.

మూర్తి తల దించేసుకున్నాడు.

సరోజ మూర్తి దగ్గరకొచ్చి నిలబడ్డది. తల వంచుకొనే మూర్తి "ఏమిటి?" అన్నాడు.

"పది రూపాయలూ అడిగారుగా" అంటూ ఇవ్వబోయింది.

"అక్కర్లేదు" అన్నాడు మూర్తి సరోజవంక కోపంగా చూస్తూ.

మూతి ముడుచుకుంటూ పోయింది సరోజ.

సరోజకూడా తనంటే అంత చులకన! ఊ! రామనాథం తనని ఏమీ అనలేడని తెలిసీ కూడా తన దగ్గర మొదట్లో ఎంత కఠినంగా మాట్లాడింది సరోజ. డబ్బు అడగటం నిజంగా నాదే తప్పు.' అనుకున్నాడు మూర్తి.

"ఏమిటయ్యా ఆ ఫైలులో సత్యనారాయణ వ్రతం అని వ్రాశావు. నీకేమన్నా మతిపోతోందా, ఏం? ఊ జాగ్రత్త....... రేపటికల్లా టేబిల్ మీద ఉన్న కాగితాలన్నీ సర్ది చక్కగా ఉంచు. పనిలో జాప్యం వుండరాదు జాగ్రత్త. ముందుగానే చెబుతున్నా. ఆఫీసరుగారు రేపు నీపని తణిఖీ చేస్తారట. మరి ఆలోచించుకో." అంటూ రామనాథంగారు గొడుగు బట్టుకు వెళ్తూ వెళ్తూ మూర్తి టైపు చేసిన కాగితాలకట్ట సత్యనారాయణవ్రతం అని వ్రాసిన ఫైలు అతడి టేబిల్మీద విసిరి కొట్టి వెళ్ళాడు.

"ఆయనకి ఒక్కతే కూతురు. ఈ లంచాలు తీసుకోటం అంతా ఆవిడ కోసరమే— అల్లుడు గారింట్లో సాయంకాలం వ్రతంట. అందుకే ఆయన మూడున్నరకే ఆఫీసు వదిలి వెళ్తున్నారు." ప్రక్క క్లర్కు చెవిలో వూదాడు. వెళ్తున్న రామనాథం వంక ముందున్న కాగితాల వంక ఆశ్చర్యంగా చూస్తున్న మూర్తిని చేతులో వూపుతూ.

సాయంకాలం గుమాస్తా లందరూ బయల్దేరుతున్నా రిళ్లకు. మూర్తి తన టేబిల్మీద ఉన్న కొన్ని కాగితాలని ఒక కట్టలో సర్ది మరో ఫైలు కనపడక పోతే అలమారాలో వెతుకుతున్నాడు. సరోజ అక్కడి కొచ్చింది. మూర్తి అటు తిరిగి నిలబడి ఉన్నాడు. సరోజ నవ్వుకుంది. "పాపం పదిరూపాయలు అడిగాడు, వ్రతం చేసుకుందామని అడిగాడు. తనన్న మాటకి కోపం వచ్చి వద్దన్నాడు." అనుకుంటూ నిలబడి ఉంది సరోజ.

ప్రక్క గుమాస్తా వెళ్తూ వెళ్తూ "వస్తాను మూర్తి, ఆ కట్టలన్నీ ఇంటికే!— రాత్రి నిద్ర పోవాయేం?" అన్నాడు.

# సత్యనారాయణ వ్రతం

"పంపేస్తారా. ఎప్పుడో పొప్పుడు వెయ్యాల్సిందేగా."

"ఆ రెండు కట్టలూ ఇంటికి తీసుకెళ్తున్నా" అలవాటుతో ఫైలు వెతుకుతూనే అన్నాడు, మూర్తి వెనక్కి చూడకుండా.

సరోజ ఏ చిన్నకాగితంతో పదిరూపాయలు చాచి, ఇంటికి తీసుకువెళ్ళే కాగితాల మీద పెట్టి వెళ్ళిపోయింది.

మూర్తి ఫైలు వెతికితెచ్చి సరోజ ఉత్తరం గమనించకుండా తొందరలో దానిమీదే ఆ తెచ్చిన కాగితాలు పడేసి కట్ట కట్టుకొని చంకన పెట్టు క్కదిలాడు ఇంటికి.

కాఫీద్దుకుంటూ ఇంటి కొచ్చిన మూర్తి ఆ కాగితాల కట్టల్ని విసుగుతో మేజా బల్లమీద విసురుగా పడేసి బట్టలు మార్చుకోడానికి అవతల గదిలోకి వెళ్ళాడు.

"అదేవిటండీ అలా విసరికొట్టారూ?" అంటూ చిందరవందరగా పడ్డ కాగితాల్ని సర్దుతున్న మూర్తి భార్యకి, సరోజ ఉత్తరం, అందులో పెట్టిన పది రూపాయిలనోటు కనబడ్డై. పద్మ, సరోజ వ్రాసిన ఉత్తరాన్ని చదువుకున్నది.

"మూర్తిగారూ. అబ్బ మరీ అంత కోపం దేనికండీ. నేనేమన్నాననీ? రావటం కాస్త ఆలస్యం అయింది. నిజమే. ఏం చెయ్యను. ఇంటి దగ్గర మావాళ్ళు ఆపారు. ఇంతలో ఇంత అల్లరై పోతుందని అనుకోలేదు. ఆ పళ్ళకోతి విశాలాక్షి ఏదేదో చెప్పేసరికి నాకూ వళ్ళు తెలీలేదు. మన్నించరూ? ఇదిగో పదిరూపాయిలు తీసుకోండి మీరొద్దంటే నే నెంత బాధపడ్తానో తెలుసా? మళ్ళీ నా మొహాన కొట్టకండి ఏమనుకోవద్దూ!

మీ

"సరోజ."

"ఇల్లు కడిగించి ముగ్గులేయించావు. బాగానే వుంది కాని ఏంలాభం వ్రతం చేసుకోటానికి డబ్బు లేదు, పురోహితుడికూడా చెప్పలేదు పద్మా—ఇవ్వాళ ఆఫీసులో తీరిక లేకపోయింది" అంటూ తడికాళ్ళు తుడుచుకుంటూ కుర్చీలో కూర్చున్నాడు మూర్తి.

"అవును పాపం తీరికెలా వుంటుంది ఆఫీసులో ప్రేమలేఖలు వ్రాసుకోడంతోటే సరిపోయె. ఇక ఇల్లు, వ్రతం, నేనూ జ్ఞాపకం ఉంటామా" మింగే కోపంతో చూసింది మూర్తిని పద్మ.

"ఏమిటి పద్మా నువ్వనేది?" ఆశ్చర్యపోతూ చూచాడు మూర్తి.

"వ్రతం చేస్తారట వ్రతం. సత్యనారాయణ వ్రతమా? సరోజవ్రతమా మీరు చేసేది?"

"సరోజవ్రతం ఏమిటి పద్మా" మళ్ళీ ఆశ్చర్య పోయాడు మూర్తి.

"చెప్పండి ఎన్నాళ్ళనుంచి ఈ భాగోతం! ఎవతది? ఆఫీసుకుపోయి మీరిదా చేసేది? దాని పదిరూపాయలు అడగాల్సిన అవసరం మీ కే మొచ్చింది? ఈ ఉత్తరం ఏమిటి? దీనర్థం ఏమిటి?" అంటూ సరోజ ఉత్తరం పదిరూపాయిలనోటు మూర్తి ముందు పడేసింది పద్మ.

ఉత్తరం చూసుకున్న మూర్తి నిర్ఘాంతపోయాడు. ఉన్న విషయం చెప్పాలని మూర్తి ప్రయత్నించాడు. కాని పద్మ వినిపించుకునే ధోరణిలో లేదు.

"నన్నిరకంగా అన్యాయం చేస్తారనుకోలేదు. మధ్యన, నాపీడ ఎందుకు మీకూ, రేపే నా పుట్టింటికి పంపించెయ్యండి. చక్కగా ఆ సరోజా మీరూ సుఖంగా ఉండొచ్చు" పమిట చెంగుతో కన్నీళ్ళు తుడుచుకుంటూ బయటికి వెళ్ళింది పద్మ.

ఆనాడు వ్రతం చేసుకుందామని సత్యనారాయణస్వామి వారి పెద్ద పటం బాగా తుడిచి బల్లమీద గోడకానించింది పద్మ. తెల్లబోయిచూశాడు మూర్తి ఆపటం వంక.

మూర్తికి ఏం చెయ్యాలో బోధ పడలేదు. పద్మ చకచకా లేచి వెళ్ళి వంటింట్లో వాలేసుకు పడుకుంది అలిగి.

సరోజ ఇచ్చిన పదిరూపాయిలు, ఆ ఉత్తరమూ మర్నాడు తిరిగివ్వటానికి నిర్ణయించుకొని వాటిని వంకెనున్న చొక్కా జేబులో భద్ర పరచాడు మూర్తి.

స్వామివారి పటానికి ఎదురుగ్గా కుర్చీలో కూర్చొని బల్లమీద ఉన్న ఫైల్సు వ్రాయటం ప్రారంభించాడు.

ఎదురింటిలో సత్యనారాయణ స్వామి వ్రతం ఘనంగా జరుగుతున్నది. రామనాథంగారి గొంతు విని ఉలిక్కి పడ్డాడు మూర్తి "అతగాడి అల్లుడు తనకెదురింట్లోనే కాపురం ఉన్నాడా?!" అనుకొని వాకిట్లోకి లేచి వెళ్ళాడు.

ఎదురింట్లో రామనాథంగారు భార్యా సమేతులై అల్లుడూ కూతురుతో సహా పట్టు పీతాంబరాలు ధరించి పీటల మీద కూర్చొని వ్రతం చేస్తున్నారు. విద్యుద్దీప కాంతులతో అలంకరింపబడ్డ స్వామి మందిరం మెరిసిపోతున్నది.

"వ్రతం చేసుకుంటున్న ఇంటికి పిలవకపోయినా ఫరవాలేదు. వెళ్ళి దేవుణ్ణి దర్శించుకొని తీర్థ మైనా పుచ్చుకు రావాలన్నారు పెద్దలు. స్వామి ప్రసాదమహాత్మ్యం గొప్పది." అనుకొని మూర్తి




## పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన చర్యను గురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన మీకుఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయుతేదీ, వేళవివరములున్నూ, మీసరియైన విరునామా, వెంటనే వ్రాసిపంపండి. జ్యోతిషశాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసినతేదీ మొదలుగా 12 మాసములలోను మీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, వ్యవహారములో మీకు జయముకలుగునో, ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, విధిపరీక్షలు, లాటరీ, అకస్మాత్ద్రవ్య లాభము మొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1.25 పైలకు పత్రము వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్టగ్రహములేవైనాఉన్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపై పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా లేనియెడల పైకము వాపసుచేయబడును. ఒకసారిపరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

PT. DEV DUTT SHASTRI, RAJ JYOTISHI,
(A. W. P.) Post Box No. 86, JULLUNDUR CITY.



నకిలీలు చూసి మోస పోవద్దు

## దర్బార్ కాజల్ (రిజిస్టర్డు)






కండ్ల అందానికి
రక్షణకు

## రాంబీర్ కంపెనీ, బొంబాయి-4 BR.

దర్బార్ గంధ్ మరియు కాజల్ తయారుచేయువారు.

ఎదురింటిలోకి వెళ్లి జనంతో కూర్చున్నాడు శుభ్రదిగా.

వ్రతసమాప్తి అయింది. అక్షింతలు వేసి నమస్కారం చేశాడు. ప్రసాదం తీసుకొని రాబ తున్న మూర్తిని రామనాథం చూడటం జరిగింది.

"మూర్తీ నువ్వు ఉండేది ఎక్కడా?" అన్నాడు రామనాథం.

"ఎదురింట్లో నండీ" సవినయంగా సమాధానం చెప్పాడు మూర్తి.

"మరి సత్యనారాయణ వ్రతం చేసుకుంటాని వ్వాళ అంటూ ఆఫీసులో అంత నీరసపడిపోయావు పని చేయకుండా?"

మూర్తి తల దించేసు కున్నాడు.

"ఇంత పచ్చి అబద్ధం చెబుతావయ్యా మూర్తీ! అందులో సత్యనారాయణస్వామి పేరు చెప్పి! ఛీ! ఏం బుద్ధయ్యా!" అంటూ తనపెద్దరికానికి తగినట్టుగా మందలించాడు మూర్తిని రామనాథం.

మూర్తికి కళ్ళ నీళ్ళ పర్యంతం అయింది. గబగబా వచ్చి తలుపు తట్టాడు. మరిరెండుసార్లు తలుపు గొట్టింతరవాత గాని భార్య లేచివచ్చి తలుపు తెరవ లేదు

పస్మతన వంక చూడకుండా తల తిప్పేసుకొని వెళ్లి పడుకుంది. గోడ గడియారం పదకొండు కొట్టింది.

'తాను సత్యనారాయణ వ్రతం చేసుకుంటా నని ఆఫీసులో అబద్ధం చెప్పాట్ట! రామనాథం నలుగురిలో తనని మందలించాడు. ఇల్లాంటి అబద్ధాలు చెప్పరాదని బుద్ధి చెప్పాడు. అవును! తాను వ్రతం చెయ్యలేదుగా! అతి వైభవంగా బంధు, మిత్రులతో సహా కూర్చొని స్వామి నలంకరించి పూజ చెయ్యలేదు. !

"నిజమే!" అనుకున్న మూర్తికి దుఃఖం పొర్లు కొచ్చింది.!

"అయితే పొద్దుట్నుంచి తాను చేసిందేమిటి? ఆ ఒక్కనాడైనా అబద్ధం చెప్పకుండా ఉండాలన్న పట్టుదలతో ఇంటా బైటా అందరిచేత అవమానింప బడ్డాడే! తాను ఆనాడు చేసింది సత్యనారాయణ వ్రతం కాదా? అది సత్య వ్రతం అని లోకం ఎందుకర్థం చేసుకోదు? తనని పైగా వ్రతం పేరు చెప్పి అబద్ధమాడే వగాకోరుగా లోకం ఎందుకు చిత్రిస్తున్నది.?"

ఈ ప్రశ్నలకు సమాధానం దొరక్క బుర్రతిరిగి పోగా, టేబిల్ మీద తలవాల్చి వనీ్రు కారుస్తూ పడిపోయిన మూర్తి వంక, తృప్తిగా చిరునవ్వుతో ఎదుటి పటంలో ఉన్న సత్యనారాయణస్వామి చూస్తున్నాడు.!

ఎందుకా చిరునవ్వు? ఎందుకాతృప్తి? ఎవరింట్లో నిజంగా ఈనాడు సత్యనారాయణ వ్రతం జరిగింది.? ఎవరి మనస్సులో నిండుగా ఆ సత్యనారాయణమూర్తి నిలిచి ఉన్నాడు?

ఈ ప్రశ్నలకు సమాధానం మాత్రం అందరికీ తెలుసు.

